క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ఈఎంఆర్ఎస్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఐదో తరగతి పాసైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని, మెళియాపుట్టిలలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మొత్తం 120 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వచ్చేనెల 19వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మూడు రోజుల్లో 16 శస్త్రచికిత్సలు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో మూడు రోజుల్లో 16 శస్త్రచికిత్సలు చేసినట్లు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో మేజర్ ఆపరేషన్లు 5, ఎల్ఎస్‌సీఎస్ ఆపరేషన్లు 3, మైనర్ ఆపరేషన్లు 8 ఉన్నాయన్నారు. సీఎస్ఎస్ సర్జన్ డీవీ శ్రీనివాస్, సీఏఎస్ సర్జన్ ఎ.జయకృష్ణ, గైనకాలజిస్ట్ హరీష్, రత్నాకర్, తదితరులు ఆపరేషన్లు చేశారని తెలిపారు.

120 లీటర్ల సారా స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని పొడ్డిశ, పూతికవలస గ్రామాల్లో టబ్బుల్లో నిల్వ ఉంచిన 120 లీటర్ల సారాతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి



రేగిడి పీహెచ్‌సీని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గుమ్మలక్ష్మీపురం: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, 24 గంటల పాటు వైద్యసేవలు అందజేయాలని తెలిపారు. గ్రామాల్లో లెప్రసీ సర్వే పక్కాగా చేయాలన్నారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వీఆర్ఎస్ ప్రాజెక్టులో చేప పిల్లలను విడిచిపెట్టిన మంత్రి

మక్కువ: మండలంలోని శంబర గ్రామం వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్‌లో శనివారం గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన మత్స్యకారుల ఉపాధి, అభివృద్ధి కోసం వీఆర్ఎస్ ప్రాజెక్ట్‌లో 24లక్షల 75వేల చేపపిల్లలను పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. దీనివలన 412 సొసైటీల పరిధిలో మత్స్యకారులకు మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని పెద్దగెడ్డ, ఆంధ్ర, వీఆర్ఎస్ జలాశయాల్లో చేప పిల్లలు విడిచిపెట్టామన్నారు. ఐటీడీఏ ద్వారా మత్స్యకారులకు వలలు, మోటార్ వాహనాలు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం చదురుగుడిలోని శంబర పోలమాంబ అమ్మవారిని దర్శించుకొని, అమ్మవారి ఘటాల ఊరేగించారు. శంబర గ్రామంలో జరుపుతున్న పనులను పరిశీలించారు. జాతరకొచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కవిరిపల్లి గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

పార్వతీపురం: వినియోగదారులకు అందించే సేవలను గుర్తించి విశాఖపట్నం టీవీ టూరిజం సంస్థ భారత సేవా ద్రష్ట అవార్డు ప్రధానం చేసిందని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు పేర్కొన్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును తనకు ప్రధానం చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వినియోగదారులకు హక్కులు, సేవలపై చేస్తున్న కృషిని అభినందించి ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. ఈయనకు అవార్డు రావడం పట్ల సంఘ సభ్యులు అభినందించారు.

నేడు రైతు ప్రదర్శన

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో ఆదివారం జరిగే రైతు ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, అయ్యార్ల సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం పిలుపునిచ్చారు. పార్వతీపురం మండలంలోని బొడ్డవలస, గొచెక్క, లిడికివలస, తాళ్లబురిడీ, కొత్తవూరు, మరికి తదితర గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, నల్ల చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఉపాధి పథకంలో వేతనం, పని దినాలు పెంచాలని కోరారు. ఆదివారం పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు జరగనున్న ప్రదర్శనలో అన్ని వర్గాల ప్రజలు, రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



అక్రమార్కుల చెరలో రాజ చెరువు..

- అభివృద్ధి చేస్తే 200 ఎకరాలకు సాగునీరు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఎప్పుడూ పైపై పనులతోనే సరిపెడుతున్న వైనం

వీరఘట్టం:

మేజరు పంచాయతీకి సమీపంలో ఉన్న రాజ చెరువు అభివృద్ధికి నోచుకోక ఆక్రమణలకు గురవుతోంది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో సుమారు 50 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైంది. ఇంతజరుగుతున్నా ఈ చెరువు అభివృద్ధిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రతి ఏటా చెరువు మొదటి భాగంలో తూతూమంత్రంగా ఉపాధి పనులు చేస్తూ మమ అనిపించేస్తున్నారు. ఈ పనుల వల్ల చెరువు అభివృద్ధి పక్కన పెడితే కనీసం ఆక్రమణలు కూడా తొలగించడం లేదు. దీంతో చెరువు మొత్తం పూడికలతో నిండిపోయి మైదాన ప్రాంతాన్ని తలపిస్తోంది. ఇదే నిర్లక్ష్యం కొనసాగితే భవిష్యత్‌లో చెరువే కనిపించకుండా పోయే ప్రమాదముందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమిత చెరువు గర్భంలో అపరాల పంట

ఇదీ పరిస్థితి..

మండలంలోని చలివేంద్రి పంచాయతీ పరిధిలో ఉన్న బూరుగ గ్రామ సమీపంలో 100 ఎకరాల విస్తీర్ణంలో రాజ చెరువు ఉంది. నాగావళి ఎడమ కాలువ నీటితో ఈ చెరువును ఏటా నింపుతున్నారు. కలువ పువ్వులకు ఈ చెరువు ప్రసిద్ధి గాంచింది. అంతేకాకుండా విలువైన మేలిమి జాతి చేపలు కూడా ఈ చెరువులో పెంచుతున్నారు. అయితే దిగువ భాగంలో ఉన్న సుమారు 200 ఎకరాల ఆయకట్టుకు ఈ చెరువు నీరే ఆధారం. ఈ చెరువు నీరు పొలాలకు వెళ్లేందుకు రెండు మదుములు కూడా ఉన్నాయి. చెరువులో నీరు ఉన్నప్పటికీ పూడికలు పేరుకుపోవడంతో ఈ నీరు పంట పొలాలకు సక్రమంగా అందడం లేదు. చెరువులో పూడికలు తొలగించి, అభివృద్ధి చేయాలని రైతులు పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేకుండా పోతోంది. ఇదిలా ఉంటే చాలా మంది చెరువును ఆక్రమించుకుంటూ సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువు అభివృద్ధికి కృషి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఇటీవల ఎంపికైన నీటి సంఘాల అధ్యక్షులు కూడా చొరవ చూపి రాజ చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో ప్రాముఖ్యత ఉంది....

ప్రపంచ మల్లయోధుడు కోడి రామ్మూర్తినాయుడు చిన్నతనంలో ఈ రాజ చెరువు గట్లుపై వ్యాయామం, యోగా చేసేవాడు. ఇక్కడుంటే పెద్ద మర్రి చెట్టు వద్ద ఆంజనేయస్వామికి పూజలు కూడా చేసేవాడని పెద్దలు చెబుతుంటారు. ఎంతో ప్రాముఖ్యం ఉన్న ఈ చెరువును అధికారులు అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మార్చాలని పలువురు కోరుతున్నారు.

మూడు పంటలు పండించవచ్చు



రాజ చెరువులో ఆక్రమణలు తొలగించి, పూడికలు తీయిస్తే ఏడాదికి మూడు పంటలు సునాయాసంగా పండించవచ్చును. అధికారులు స్పందించి చెరువు అభివృద్ధికి చర్యలు చేపట్టాలి.

– బాసూరు వెంకటనాయుడు, రైతు, వీరఘట్టం

పర్యాటక కేంద్రంగా మార్చాలి



రాజ చెరువుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. బాహుబలి కోడి రామ్మూర్తినాయుడు సంచరించే ప్రదేశమిది. ఆయన వ్యాయమ విద్యను ఇక్కడ నుండే ప్రారంభించాడు. అటువంటి యోధుడికి ఘన నివాళి చెప్పాలంటే ఈ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

– పిన్నింటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, వీరఘట్టం

ఓటింగ్ ద్వారా మేట్‌లను ఎన్నుకోవాలి

భామిని: ఉపాధి హామీ పథకంలో మేట్ల నియామకానికి ఓటింగ్ నిర్వహించాలని మండల కమిటీ సభ్యులు తీర్మానించారు. ఎంపీపీ తోట శాంతికుమారి ఆధ్వర్యంలో ఎంపీడీఓ వై.సత్యం అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏపీఓ తులసీదాస్ మాట్లాడుతూ, కొత్త విధానంలో భాగంగా యాభై మంది వేతనదారులకు ఒక మేట్‌ను నియమించే విధానంపై వివరణ ఇస్తుండగా.. సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు, ప్రత్యేక ఆహ్వానితుడు తోట సింహాచలం, తదితరులు వ్యతిరేకించారు. ఓటింగ్ పద్ధతిలో మేట్‌లను ఎన్నుకోవాలని డిమాండ్ చేయగా.. అందరూ అంగీకరించారు. అంతకుముందు జెడ్పీ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు కొవ్వాడ చిరంజీవులు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ భోనగడ్డి ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు టింగ అన్నాజీరావు, పాలక మురళీ, బూస బాలకృష్ణ, పాలక ఉషారాణి, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ తులసీదాస్

పశువైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

గరుగుబిల్లి: పాడిరైతులంతా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి ఎస్.సురేష్ కోరారు. మండలంలోని బురదవెంకటాపురం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ బొత్స లక్ష్మి శనివారం ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన మూగజీవాలకు వైద్య సిబ్బంది తనిఖీలు నిర్వహించి, అవసరమైన వాటికి ఉచితంగా మందులు అందజేశారు. కొన్ని పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా నివారణ టీకాలు వేశారు.

తివ్వాకొండలో..

భామిని: మండంలోని తివ్వాకొండలపై గల మణిగలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మూగజీవాలు, పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. అలాగే సాధారణ చికిత్సలకు వైద్యం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండగొర్రి చంటి, వైద్య సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు. అలాగే నేరడి-బిలోనూ పశు వైద్యశిబిరం నిర్వహించి మందులు అందించారు.



భామిని: వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్, సర్పంచ్ కొండగొర్రి చంటి



గరుగుబిల్లి: శిబిరంలో పశువైద్య సిబ్బంది సేవలు

క్రీడానైపుణ్యం పెంపొందించుకోవాలి

కొమరాడ: విద్యార్థులు, యువత అంతా క్రీడానైపుణ్యం పెంపొందించుకోవాలని పార్వతీపురం రూరల్ సీఐ ఎస్.గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో వాలీబాల్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు గిరి శిఖర గ్రామాల నుంచి మొత్తం 16 జట్లు పాల్గొని, వారిలోని క్రీడాప్రతిభను చాటారు. కొండకునేరుకు చెందిన సతీష్ జట్టు విజేతగా నిలవగా, కెమిశీల గ్రామ వంశీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు సీఐ, ఎస్ఐల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. సీఐ మాట్లాడుతూ క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత భవిష్యత్ పొందారని ఉదహరించి, స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో ఎస్ఐ నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు సూచనలిస్తున్న సీఐ గోవిందరావు

'ఉల్లాస్' తరగతులు ప్రారంభం



భామిని: మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం, ఏపీఎం చక్రపాణి



పాలకొండ రూరల్: ఉల్లాస్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న, ప్రజాప్రతినిధులు, అధికారులు

జియ్యమ్మవలస: మండలంలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) శిక్షణా తరగతులను ఎంపీపీ బొంగు సురేష్ శనివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసులోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం ప్రారంభం కాగా ఆ కార్యక్రమంలో భాగంగా పలువురికి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడంపై శిక్షణ ఇచ్చారు. మండలంలో మొత్తం 1430 మందిని అక్షరాస్యులను చేయడం కోసం ప్రత్యేకంగా ఎంపిక చేసిన టీవోటీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని ఎంపీడీవో ఎస్.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పల్లి రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు గుణుపూరు పార్వతి, ఏపీఎం త్రినాధమ్మ తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సురేష్

ఉల్లాస్‌తో అక్షరాస్యత పెంపు..

భామిని: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం మీసాల చక్రపాణి ఆధ్వర్యంలో ఉల్లాస్ ప్రోగ్రాంలో భాగంగా వలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె. సత్యం మాట్లాడుతూ.. సమాజంలో నిరక్షరాస్యత నిర్మూలనకు ఉల్లాస్ ప్రోగ్రాం ఉపకరిస్తుందని చెప్పారు.కార్యక్రమంలో వెలుగు సీఓ రాజ్‌కుమార్, కృష్ణవేణి, సీసీలు, సీఏఫ్‌లు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ..

పాలకొండ రూరల్: ఉల్లాస్ వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా ఐకేపీ నేతృత్వంలో వలంటీర్ టీచర్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ బి.భాను అన్నారు. కార్యక్రమంలో ఐకేపీ, ఐసీడీఎస్ అధికారులు సూరమ్మ, దశారత్నం, మేరి, సంగంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులంతా ఓటు గొప్పతనం వివరించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతిఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలిపారు. మనకున్న ఓటుతో మనకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటుహక్కు పొందాలన్నారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



భామిని: మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ అప్పారావు, ఆర్ఐ కృష్ణారావు



గరుగుబిల్లి: ఉల్లిబద్రలో ఓటు హక్కు ఆవశ్యకతపై వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం



వీరఘట్టం: ప్రధాన రహదారిలో ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ అధికారులు



జియ్యమ్మవలస: అల్లువాడలో ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



పాలకొండ రూరల్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం సూర్యనారాయణ



సీతంపేట: ఓటర్ల దినోత్సవం సందర్భంగా సామరెల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి

పార్వతీపురం టౌన్: పది, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై హాస్టల్ వార్డెన్లు దృష్టి సారించాలని సాంఘిక సంక్షేమ డీడీ గయాజుద్దీన్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా వసతి గృహ వార్డెన్లతో స్థానిక కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. మార్చిలో జరగనున్న టెన్త్, ఇంటర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అధిక శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహ భవనాలు 13 ఉండగా, అందులో 11 భవనాలకు మైనర్, మేజర్ రిపేర్లు చేయించడానికి రూ.189 లక్షలు మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు. ఈ పనులను వసతి వార్డెన్ దగ్గరుండి ఫిబ్రవరి నెలాఖరులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ ఏడాది విద్యార్థులకు టవల్స్, స్పోర్ట్స్ మెటీరియల్, వంట పాత్రలు, స్టేషనరీ సౌకర్యాలకు సంబంధించిన సరుకులు ప్రభుత్వం ముందుగానే అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను గౌరవించండి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: అధికార పార్టీకి చెందిన అనామకులకు ఇస్తున్న గౌరవం.. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు ఇవ్వడకపోవడం దారుణమని ఎంపీపీ కుంబురుక దీనమయ్య, ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. అధికారులు శాఖాపరమైన సమాచారాన్ని అధికార పార్టీ వారికి చెబుతున్నారే తప్ప ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు చెప్పడం లేదని అధికారుల తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరి అధికారమూ శాశ్వతం కాదని, ప్రజాప్రతినిధులను గౌరవించడాన్ని అధికారులు బాధ్యతగా గుర్తించాలని హితవుపలికారు. తొమ్మిది నెలలు కావస్తున్నా ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని, నిధులు లేవని చెబున్నారని, అలాంటప్పుడు అధికారులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఏ విధంగా జీతభత్యాలు, గౌరవ వేతనాలు ఇస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు ఎం.రమణ ప్రశ్నించారు. వైద్య తనిఖీల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఏ రోజు ఏ సమయంలో వైద్యులు అందుబాటులో ఉంటారో ముందుగానే తెలియజేయాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్న వారికి కూడా మందులు బయట కొనుక్కోమని చెప్పే పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయన్నారు. అన్నిరకాల మందులు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాబోయే సీజన్‌లో జీడి పిక్కల కొనుగోళ్లు గిరిజన రైతుల నుంచి చేపట్టాలంటే కలెక్టరు ఆదేశాల మేర కొనుగోళ్లు జరుగుతుందన్నారు. నిమ్మగడ్డి సాగును ప్రోత్సహించాలని ప్రజాప్రతినిధులకు వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే గృహ నిర్మాణాల నగదును రూ.5 లక్షలకు పెంచాలని ప్రజాప్రతినిధులంతా డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీపీ దీనమయ్య

రక్తదాన శిబిరం..



అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి గ్రామానికి చెందిన యడ్ల శ్రావణ్‌కుమార్‌తో పాటు మరో 12 మంది గణతంత్ర దినోత్సవంలో భాగంగా శనివారం రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు జె.రవీంద్రకుమార్, శివప్రకాష్, రవికుమార్, రక్తనిల్వల కేంద్రం ప్రతినిధి సత్యంనాయుడు, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

– పాలకొండ రూరల్

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి..



ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఓటుహక్కు పొందడంతో పాటు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, సచివాలయాల సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

– పాలకొండ

విద్యార్థులకు పోటీలు..



ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు, వీఆర్ఓ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

– సీతంపేట